గతి తప్పిన విద్యార్థి

విద్యార్థులు కొందరు తమ జీవితాన్ని చేజేతులా నాశనం చేసుకుంటున్నారు. గంజాయి ఊబిలో కూరుకుపోతున్నారు. వారి ఉజ్వల భవితకు వారే పొగ పెట్టుకుంటున్నారు. వాడకం నుంచి విక్రయం వరకు విద్యార్థుల హస్తం కనిపిస్తోంది. ఇప్పుడు ఏకంగా స్మగ్లింగ్ చేయడానికి సిద్ధమవుతున్నారు. తల్లిదండ్రుల కన్న కలలు నిజం చేస్తారనుకుంటే దారి తప్పుతున్నారు. అక్రమ సంపాదనతో జల్సాలు చేస్తున్నారు. వీరిని చూసి మరి కొందరు విద్యార్థులు ఈ ఊబిలోకి దిగుతున్నారు.

- గంజాయి ఊబిలో బీటెక్ స్టూడెంట్స్
- అక్రమ రవాణాలోకి దిగిన వైనం
- పోలీసుల విచారణలో వెల్లడి



పలమనేరు: విశాఖ నుంచి బెంగళూరుకు గంజాయి తరలించడంలో పలమనేరు పట్టణం కీలకంగా మారుతోంది. బెంగళూరులో గంజాయి సిగరెట్లకు మంచి గిరాకీ ఉంది. గంజాయి మత్తుకు అలవాటు పడిన వారికి ఇది లేకుండా పిచ్చి పట్టే పరిస్థితిని అక్కడి గంజాయి ముఠా తీసుకొచ్చింది. వారికున్న భారీ నెట్‌వర్క్‌తో ఇచ్ఛాపురం నుంచి పలురకాల వాహనాల్లో 25 గంటలపాటు ప్రయాణించి బెంగళూరుకు గంజాయిని రవాణా చేయిస్తున్నారు. దాదాపు 1,264 కిలోమీటర్లు వీరు అత్యంత జాగ్రత్తగా వారి నెట్‌వర్క్ పనిచేస్తూ ఉంటుంది. ఇచ్ఛాపురం నుంచి 16వ నంబర్ జాతీయ రహదారి మీదుగా నెల్లూరు, తిరుపతి బైపాస్, చిత్తూరు బైపాస్, పలమనేరు మీదుగా కర్ణాటకలో రాష్ట్రంలోకి అక్రమ రవాణా సాగుతోంది. ఈ మార్గంలో ముఖ్యమైన చెక్‌పోస్టులు, పోలీసుల తనిఖీలున్నప్పటికీ గంజాయి అక్రమ రవాణా సాగుతూనే ఉంది.

గంజాయి మత్తులో చిత్తవుతున్న యువత

మత్తుకు అలవాటు పడిన వారు గంజాయి లేకుంటే బతకలేని స్థితికి చేరుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలోని తిరుపతి, చిత్తూరు, పలమనేరు, పుంగనూరు, పీలేరు, కుప్పంలో ఇప్పటికీ మత్తుకు బానిసైన వారికి ప్యాకెట్లు అందుతున్నాయంటే ఆయా ప్రాంతాల్లో గంజాయి విక్రయించే ఏజెంట్లు ఇంకా కొనసాగుతున్నారు. రూ.వంద నుంచి వెయ్యి వరకు సైజులవారిగా వీటిని ప్యాకెట్లలో పెట్టి ఖాళీ సిగరెట్ ప్యాక్‌లో నింపి అమ్ముతున్నట్టు తెలుస్తోంది. ఏదేమైనా గంజాయి కారణంగా ఎంతో భవిష్యత్తున్న యువకుల జీవితాలు సర్వనాశనమవుతున్నాయి. గంజాయి స్మగ్లింగ్, విక్రయాలపై స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో మరింత ఫోకస్ పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ విషయమై స్థానిక సెబ్ సీఐ సురేష్ రెడ్డిని వివరణ కోరగా ఇప్పటికే స్థానికంగా గంజాయి అక్రమ రవాణాదారులపై కేసులు పెడుతున్నామని ఆయన తెలిపారు. తాజాగా ఐదుగురు స్టూడెంట్స్ గంజాయిని వైజాక్ నుంచి బైక్‌లపై తెచ్చి ఇక్కడి ఏజెంట్లకు అమ్ముతుండగా దాడులు చేసి పట్టుకున్నామని, వారిచ్చిన సమాచారంతో లోతుగా దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.



పోలీసులకు పట్టుబడిన గంజాయి పార్శిల్స్ (ఫైల్)

ఇవీ సంఘటనలు

- వారం క్రితం తిరుపతిలో చదువుతున్న పలమనేరు నియోజకవర్గానికి చెందిన విద్యార్థులు బైక్‌లపై విశాఖకు వెళ్లి గంజాయి తీసుకుని ఇక్కడకు వచ్చేశారు. ఇక్కడ స్థానిక విద్యార్థులకు ఆ గంజాయి విక్రయిస్తుండగా పోలీసులకు పట్టుబడ్డారు. వీరిని విచారించగా తిరుపతిలోని బీటెక్ విద్యార్థులు గంజాయి వ్యాపారంలో బాగా సంపాదిస్తూ జల్సాలు చేస్తున్నారని, వీరిని చూసి మరి కొందరు స్టూడెంట్స్ ఈ వ్యాపారంలోకి దిగినట్లు తేలింది.
- గతంలో పట్టణ సమీపంలోని బైపాస్ రోడ్డు వద్ద ప్రమాదానికి గురైన వాహనంలో భారీగా గంజాయిని స్థానిక పోలీసులు గుర్తించారు. డ్రైవర్‌ను విచారించగా సరుకు బెంగళూరుకు వెళుతోందని హొస్కోట వద్ద దీన్ని తీసుకెళ్లే కొరియర్లున్నారని చెప్పాడు.
- ఇటీవల పలమనేరు పోలీసులు గాంధీనగర్ బస్టాప్ వద్ద ఆటోల్లో గంజాయిని బెంగళూరుకు తరలించే ముఠాను అరెస్ట్ చేశారు. వీరు చిన్నచిన్న ప్యాకెట్లుగా గంజాయిని సిద్ధం చేసుకుంటుండగా పోలీసులు పట్టుకున్నారు.
- ఏకంగా అంబులెన్స్‌లో తరలిస్తున్న ముఠాను గంగవరం పోలీసులు గతంలో పట్టుకున్నారు. బొలేరో, ట్రాక్టర్ ఢీకొన్న సంఘటనలో బొలేరోలో గంజాయి ప్యాకెట్లను పలమనేరు పోలీసులు గుర్తించారు. వాహనంలోని సీట్లకింద, బ్యానెట్, ఇంజిన్‌లో కనిపించకుండా తీసుకెళ్తున్న విషయం బట్టబయలైంది. మరికొందరు విశాఖ నుంచి బెంగళూరుకు బైక్‌లపై గంజాయిని తరలిస్తున్నట్టు ఇప్పటికే సెబ్ అధికారులు పసిగట్టారు.

క్లుప్తంగా

జెడ్పీ ఉన్నత పాఠశాల తనిఖీ



టీచర్లతో మాట్లాడుతున్న డీవైఈఓ

బైరెడ్డిపల్లె: మండలంలోని పెద్దచల్లారగుంట జెడ్పీ ఉన్నత పాఠశాలను మంగళవారం డీవైఈఓ చంద్రశేఖర్ తనిఖీ చేశారు. పాఠశాలలో జరిగిన నాడు–నేడు పనులను పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేసి ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టీచర్లు సమయపాలన పాటించాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి తీసుకురావాలని తెలిపారు.

నివాళి



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ

గంగవరం: మండలంలోని గుండుగల్లు పంచాయతీ బొమ్మనపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు చలపతిరెడ్డి తల్లి స్వర్ణమ్మ (82) అనారోగ్యంతో మంగళవారం మృతిచెందారు. విషయం తెలిసి మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ బొమ్మనపల్లికి చేరుకుని మృతురాలి పార్థివదేహానికి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, సర్పంచుల సంఘం అధ్యక్షుడు గిరిరాజారెడ్డి, గుండుగల్లు సర్పంచ్ రమణ, మామడుగు సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ పురుషోత్తం, నేతలు వినోద్‌రెడ్డి, బైరెడ్డి, మహేష్ రెడ్డి, శ్రీనివాసులు ఉన్నారు.

ఎల్‌ఈడీ లైట్ల ఏర్పాటు



అంబేడ్కర్ సర్కిల్లో ఎల్‌ఈడీ బల్బులను అమర్చుతున్న సిబ్బంది

పలమనేరు: పట్టణంలోని పలు వార్డులతో పాటు ప్రధాన కూడళ్లలో స్థానిక మున్సిపల్ అధికారులు ఎల్ ఈడీ లైట్లను మంగళవారం ఏర్పాటు చేశారు. కొన్నిచోట్ల గతంలో అమర్చిన బల్బులు దెబ్బతిన్న విషయం తెలిసిందే. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎల్‌ఈడీ బల్బులను ఏర్పాటు చేస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి తెలిపారు.

రక్తహీనత నివారణపై అవగాహన



ఆశా వర్కర్లకు అవగాహన కల్పిస్తున్న సావిత్రమ్మ

బైరెడ్డిపల్లె: యుక్త వయస్సులో చాలా మంది బాలికలు రక్తహీనత వలన తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, గ్రామాల్లో బాలికలకు పూర్తి అవగాహన కల్పించాలని హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ సూచించారు. బైరెడ్డిపల్లె పీహెచ్‌సీలో మంగళవారం ఆశా వర్కర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రజలకు వివరించాలన్నారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం ఆవశ్యకతను చెప్పాలన్నారు. ఈనెల 20న నిర్వహిస్తున్న జాతీయ నులిపురుగుల నివారణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

ఇండోర్ స్టేడియం కూల్చివేతపై చర్యలు



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న సభ్యులు

పుంగనూరు: పట్టణంలోని ఎంబీటీ రోడ్డులోని ఇండోర్ స్టేడియం కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకోనున్నట్లు మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, చల్లా బాబు హామీ ఇచ్చినట్లు ఫ్రెండ్స్ షటిల్ అసోసియేషన్ సభ్యుడు రాజారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పుంగనూరుకు వచ్చిన మంత్రికి సంఘం తరఫున వినతిపత్రం అందజేశామన్నారు. స్థలం ప్రభుత్వానిదని, కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకుంటామని, అదే ప్రాంతంలో ఇండోర్ స్టేడియంను నిర్మించి ఇస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు రాజారెడ్డి తెలిపారు. సంఘ సభ్యులు డాక్టర్ శరణ్, అనిల్‌కుమార్, సుధాకర్‌రెడ్డి, భాస్కర్‌జెట్టి, శ్రీధర్ రెడ్డి, హరి, మధుసూదన్‌రెడ్డి, వాసు, నానబాల గణేష్, నారాయణ రాజు పాల్గొన్నారు.

ప్రైవేట్ అర్చకుల నుంచి దరఖాస్తులు

కాణిపాకం: ప్రైవేట్ దేవస్థాన అర్చకులకు ప్రభుత్వం కనీస వేతనం ఇచ్చేందుకు నిర్ణయం తీసుకుందని, ఈ మేరకు అర్హులైన అర్చకుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా దేవదాయశాఖ ఏసీ ప్రసన్నలక్ష్మి తెలిపారు. ఆ అర్చకులు దరఖాస్తు ఫారం పూర్తి చేసి ఆధార్, బ్యాంకు ఖాతా జిరాక్స్ పత్రాలు, ఫొటోలను జత చేసి బుధవారం సాయంత్రంలోపు చిత్తూరు చర్చివీధిలోని దేవదాయశాఖ ఏసీ కార్యాలయానికి అందజేయాలన్నారు.

మెరుగైన సేవలకు కృషి

సదుం: రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తహసీల్దార్ మారుఫ్ హుస్సేన్ తెలిపారు. ఇటీవల ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన ఆయనను కార్యాలయ సిబ్బందితో పాటు పలువురు అభినందించారు.

మండల సర్వసభ్య సమావేశం రేపు

శాంతిపురం: మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని గురువారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బి.మైథిలి తెలిపారు. రేపు ఉదయం 10 గంటలకు ఎంపీపీ వసుంధర అధ్యక్షతన మండల సచివాలయంలోని మీటింగ్ హాల్లో సమావేశం జరుగుతుందన్నారు. మొత్తం 19 శాఖల పనితీరు సమీక్షించడంతో పాటు అధ్యక్షుల అనుమతితో ఇతర అంశాలను చర్చిస్తామని చెప్పారు. మండల అధికారులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని ఆమె కోరారు.

గుండ్లపల్లిలో పొలంబడి



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

పలమనేరు: మండలంలోని గుండ్లపల్లిలో స్థానిక వ్యవసాయశాఖ, ఎఫ్‌పీఓ(రైతు ఉత్పాదక సంస్థ)ల సంయుక్త ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు మెరుగైన వ్యవసాయ పద్ధతులను వివరించారు. ముఖ్యంగా సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పించారు. మట్టి, నీటి నమూనా పరీక్షల ఆధారంగా పంటలను పండిస్తే కలిగే ప్రయోజనాలను స్థానిక ఏడీ అన్నపూర్ణాదేవి వివరించారు. ఏఓ సంధ్య, సిబ్బంది ప్రేమ, రైతులు పాల్గొన్నారు.

లక్ష్యాన్ని జయిస్తేనే బంగారు భవిత

–డీఎస్పీ రఘువీర్‌విష్ణు

గంగవరం: ఒక విద్యార్థి తన జీవితంలో తాను అనుకున్న లక్ష్యాన్ని జయించినప్పుడే బంగారు భవితకు బాటలు పడతాయని పలమనేరు డీఎస్పీ రఘువీర్ విష్ణు విద్యార్థులకు సూచించారు. మంగళవారం మండలంలోని మదర్‌థెరిసా ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులతో ఆయన సమావేశమై మాట్లాడారు. విద్యార్థులు చదువులపై ఏకాగ్రత పెట్టి ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలన్నారు. ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని ఆ లక్ష్య సాధనకు శ్రమించాలన్నారు. ఎలాంటి క్లిష్ట పరిస్థితులోనైనా ఆత్మస్థైర్యంతో ఎదుర్కోవాలే తప్ప ఆత్మహత్యలకు పాల్పడి తల్లిదండ్రులకు గర్భశోకం మిగల్చవద్దని సూచించారు. విద్యార్థులు వాహనాలు నడిపే ముందు రోడ్డు నిబంధనలు తప్పక పాటించాలన్నారు. కార్యక్రమంలో సీఐ చిన్నగోవింద్, కళాశాల కరెస్పాండెంట్ రవీంద్రబాబు, చైర్మన్ సునీల్, అకడమిక్ డైరెక్టర్ రాజేంద్రరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ రఘువీర్‌విష్ణు

మాదకద్రవ్యాల బారిన పడకండి

పుంగనూరు: విద్యార్థులు మాదక ద్రవ్యాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రిన్సిపల్ డాక్టర్ రాజశేఖర్ కోరారు. మంగళవారం శుభారాం డిగ్రీ కళాశాలలో సెబ్ ఎస్‌ఐ హరికృష్ణ ఆధ్వర్యంలో డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థుల ప్రవర్తనలో మార్పులు వస్తే తల్లిదండ్రులు వెంటనే గమనించాలన్నారు. ఎప్పటికప్పుడు విద్యార్థులపై నిఘా అవసరమన్నారు. మాదకద్రవ్యాల వినియోగం, విక్రయాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండి, సంబంధిత పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అధ్యాపకులు టి.రాజశేఖర్, డాక్టర్ శ్రీనివాస్, అనిల్‌కుమార్, సెబ్ హెడ్ కానిస్టేబుల్ సుబ్రమణ్యం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపల్, చిత్రంలో ఎస్‌ఐ

రాయితీ పరికరాలకు దరఖాస్తులు

బంగారుపాళెం: రైతులు రాయితీ డ్రిప్ పరికరాలకు దరఖాస్తు చేసుకోవాలని ఉద్యానశాఖ అధికారి సాగరిక మంగళవారం తెలిపారు. వ్యవసాయ సాగులో బిందు, తుంపర్ల పద్ధతిలో అవలంబించే రైతులకు ప్రభుత్వం రాయితీతో పరికరాలను అందిస్తున్నట్లు చెప్పారు. 5 ఎకరాల పొలం ఉన్న చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం రాయితీతో డ్రిప్, స్ప్రింక్లర్లను అందించడం జరుగుతోందన్నారు. 5 ఎకరాలు పైన ఉన్న రైతులకు 70 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు చెప్పారు. రాయితీ పరికరాలు అవసరమైన రైతులు పొలానికి సంబంధించిన 1బీ, ఆధార్ జిరాక్స్ కాపీలతో వెళ్లి రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

తల్లిపాలు అమృతంతో సమానం

పెద్దపంజాణి: తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని, వ్యాధి నిరోధక శక్తి పెరిగి ఆరోగ్యవంతంగా పిల్లలు ఎదుగుతారని పెద్దపంజాణి ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి టి.మురళి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తల్లిపాల ప్రాముఖ్యతపై అంగన్‌వాడీ వర్కర్లకు అవగాహన కల్పించారు. బిడ్డ పుట్టిన మొదటి అరగంటలోపు తల్లులకు వచ్చే ముర్రుపాలను కచ్చితంగా శిశువుకు పట్టాలని తెలిపారు. దీని వలన వ్యాధి నిరోధకశక్తి పెరగడమే కాకుండా సమతుల్యమైన పోషకాహార పదార్థాలు అందుతాయన్నారు. బిడ్డ పుట్టిన గంట నుంచి ఆరు నెలల వరకూ తల్లిపాలు తప్ప వేరే ఆహార పదార్థాలు ఇవ్వకూడదని పేర్కొన్నారు. సీడీపీఓ ఇందిరా ప్రియదర్శిని, ఎంపీడీఓ అబ్దుల్ రహీం, సూపర్‌వైజర్‌లు శారద, గీతమ్మ పాల్గొన్నారు.



తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మురళి

క్షయ రహిత సమాజమే లక్ష్యం



స్థానిక ఆస్పత్రి వైద్యులు, సిబ్బందితో డాక్టర్ నీరజ

–టీబీ ప్రోగ్రాం రాష్ట్ర అధికారి నీరజ

పలమనేరు: సంపూర్ణ క్షయ రహిత సమాజమే ప్రభుత్వ ధ్యేయమని, ఇందుకోసం అవసరమైన చర్యలను తీసుకుంటున్నామని టీబీ ముక్తభారత్ ప్రోగ్రాం రాష్ట్ర అధికారి డాక్టర్ నీరజ తెలిపారు. స్థానిక ఏరియా ఆస్పత్రిలోని టీబీ విభాగాన్ని మంగళవారం ఆమె తనిఖీ చేశారు. ఇక్కడి వైద్యులకు టీబీ వ్యాధిగ్రస్తుల నిర్ధారణ, ఇన్‌ఫెక్షన్ కంట్రోల్ సిస్టం, ఆస్పత్రిలో ఇతర రోగులు విధిగా మాస్కులు ధరించాలనే సూచించారు. గత జనవరిలో తాను సూచించిన అన్ని పనులను ఆస్పత్రిలో చక్కగా చేశారని కితాబిచ్చారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ మమతారాణి, ఆర్‌ఎంఓ శారద, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు ముమ్మరం

పలమనేరు: మున్సిపాలిటీ పరిధిలోని పెద్దచెరువు, రాధాబంగ్లాలలో స్థానిక మున్సిపల్ అధికారుల ఆదేశాలతో సిబ్బంది మంగళవారం పారిశుధ్య పనులు చేశారు. జేసీబీలతో డ్రైన్లను శుభ్రం చేశారు. చెరువు కట్టపై ఉన్న వ్యర్థాలను తొలగించారు. అన్నా క్యాంటీన్ పనులను వేగవంతం చేయాలని సూచించారు. పట్టణంలోని కాకాతోపు, రంగాపురం సచివాలయాల పరిధిలోని గృహనిర్మాణదారులతో మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి సమావేశాన్ని నిర్వహించారు. ఇంటి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. మున్సిపల్ మేనేజర్ ఖాదర్ మొహిద్దీన్, ఏఈ రూపేష్, హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



పనులను పర్యవేక్షిస్తున్న మున్సిపల్ కమిషనర్

సూపర్‌బజార్ పార్టీ ఇన్ పర్సన్‌గా ఆర్వీ బాలాజి

పలమనేరు: పట్టణంలోని సహకారశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలాజీ సహకార సూపర్‌బజార్ పార్టీ ఇన్ పర్సన్‌గా పట్టణానికే చెందిన టీడీపీ నేత ఆర్వీ బాలాజీ మంగళవారం నియమితులయ్యారు. ఆమేరకు ప్రభుత్వం నుంచి పార్టీ ఇన్ పర్సన్‌తో పాటు పది మంది డైరెక్టర్ల జాబితా అందిందని జిల్లా సహకారశాఖ సీనియర్ అసిస్టెంట్ బాబు తెలిపారు. గత పాలకవర్గ గడువు ఈనెల4న ముగిసిన విషయం తెలిసిందే. ఇప్పటిదాకా నాలుగు దశాబ్దాలుగా ఆర్వీ సుభాష్ చంద్రబోస్ సూపర్‌బజార్ అధ్యక్షుడిగా కొనసాగారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆయన్ను తప్పించి ఆయన సోదరుడైన టీడీపీ నేత ఆర్వీ బాలాజీకి అవకాశం కల్పించారు. ఈ పదవులు ఆరు నెలలు మాత్రమే ఉంటాయని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



బాలాజీ సూపర్ బజార్ నూతన కార్యవర్గం

హొసూర్ నుంచి కాలినడకన..

వి.కోట: తిరుమల వెంకన్నను దర్శించుకోవడానికి 250 మంది భక్తులు కాలినడకన తమిళనాడు రాష్ట్రం హొసూరు నుంచి తిరుమలకు బయలుదేరారు. మంగళవారం వి.కోట మండలం మీదుగా వీరి ప్రయాణం సాగింది. భక్తులను సాక్షి పలకరించగా ప్రతి ఏటా శ్రావణ మాసంలో తాము వెంకన్న దర్శనానికి 450 కిలోమీటర్లు కాలినడకన వెళతామన్నారు. తమ ప్రయాణం 8 రోజుల పాటు కొనసాగుతుందన్నారు. కాలినడకన వెళ్లి మొక్కులను చెల్లించుకోవడం ప్రతి ఏటా తమ ఆనవాయితీగా వారు పేర్కొన్నారు.



తిరుమలకు కాలినడకన వెళుతున్న భక్తులు

సూపర్ బజార్ ఎన్నికలకు మంగళం!

- ఎప్పుడైనా ఎన్నికలకు సిద్ధమన్న పాలక వర్గం
- పార్టీ ఇన్ పర్సన్‌ను నియమించిన ప్రభుత్వం
- మరో ఆరునెలల దాకా ఈ పాలకవర్గంతోనే పాలన
- ఆపై షరా మామూలుగా అదే కొనసాగింపు
- ఏడేళ్లుగా సూపర్‌బజార్‌కు జరగని ఎన్నికలు

పలమనేరు: పలమనేరు బాలాజీ కో–ఆపరేటివ్ సూపర్ బజార్ ఎన్నికలకు అధికారంలోని కూటమి ప్రభుత్వం మంగళం పాడింది. గత పాలకవర్గం గడువు ఈనెల నాల్గున ముగియడంతో షేర్‌హోల్డర్లు సైతం ఈ ప్రభుత్వంలో ఎన్నికలు జరగడం ఖాయమనుకున్నారు. ఆమేరకు కొత్త ఓటర్ల నమోదులు కూడా మొదలయ్యాయి. అయితే అందరి అంచనాలను తలకిందులు చేస్తూ కూటమి ప్రభుత్వం సూపర్‌బజార్ ఎన్నికకు బ్రేక్ వేసింది. అధికారంలో ఉన్న ప్రభుత్వాలు అనుసరించే వ్యూహాన్ని ఫాలో అవుతూ తమకు కావాల్సిన వారికి పార్టీ ఇన్ పర్సన్‌గా డైరెక్టర్లుగా నియమిస్తూ మంగళవారం ప్రభుత్వం నుంచి ఆదేశాలను తెప్పించింది. వీరి పదవీకాలం మరో ఆరునెలలు దాకా ఉంటుంది. ఆపై కూడా సూపర్ ఎన్నికలు జరిగేది అనుమానంగానే మారింది. ఏదేమైనా ఈ దఫా ఎన్నికలు ఇరు పార్టీలకు రసకందాయకంగా ఉంటాయని అందరూ భావించారు. కానీ అధికార పార్టీ తన అధికారాన్ని వాడుకుంది. సూపర్‌బజార్‌కు ఎన్నికలు జరిగేనా అనే శీర్షికన ఈనెల 1న సాక్షి దినపత్రికలో కథనం సైతం ప్రచురితమైంది. ఆపై జరిగిన పరిణామాల్లో ప్రభుత్వం ఎన్నికలు లేకుండా ఈ నిర్ణయాన్ని తీసుకోవడం కొసమెరుపు.

ఇక ఎన్నికలు లేనట్టే..

గత ఏడేళ్లుగా సూపర్‌బజార్‌కు వివిధ కారణాలతో ఎన్నికలు జరగని విషయం తెలిసిందే. ఇటీవల సాధారణ ఎన్నికలు పూర్తవడంతో త్వరలోనే ఈ ఎన్నిక జరుగుతుందని అందరూ భావించారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సూపర్‌బజార్‌లో అక్రమాలు జరుగుతున్నాయంటూ ఇక్కడి నేతలు విచారణ జరిపించిన విషయం తెలిసిందే. కానీ విచారణ అధికారి అలాంటివేమీ లేవని క్లీన్‌చిట్ ఇచ్చారు. మరోవైపు పాలకవర్గం సైతం తాము ఎన్నికలకు సిద్ధమేనని ప్రకటించింది. దీంతో కూటమి నేతలు ఎన్నికలను జరిపించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే ఇది సహకారశాఖకు సంబంధించిన విషయం కావడంతో ప్రభుత్వం నుంచి ఆదేశాలందాకే ఎన్నికల ప్రక్రియ జరిగే అవకాశం ఉంటుందని ఆపార్టీ శ్రేణులు సైతం మీడియా ముందు తెలిపాయి. కానీ రాజకీయ ఎత్తుగడలో భాగంగా పార్టీ ఇన్ పర్సన్ ద్వారా పాలనకే మొగ్గు చూపింది. దీంతో ఇక ఈ ఎన్నికలకు బ్రేక్ పడినట్టైంది.



బాలజీ కో–ఆపరేటివ్ సూపర్‌బజార్

బోస్‌కు వీడిన పీఠం..

45 ఏళ్లకు ముందు ఏర్పాటు చేసిన ఈ సూపర్‌బజార్‌కు పట్టణానికే చెందిన సుభాష్ చంద్రబోస్ అధ్యక్షుడిగా 38 ఏళ్ల నుంచి మొన్నటి దాకా కొనసాగారు. ఇందులో 14 వేల మంది దాకా ఓటర్లున్నారు. ఇక్కడ సూపర్‌బజార్‌కు జరిగే సహకార ఎన్నికలు సైతం సాధారణ ఎన్నికలను తలపించేలా గతంలో సాగాయి. అందుకే నియోజకవర్గంలో సూపర్‌బజార్ ఎన్నికలకు భలే క్రేజుంది. దానికితోడు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఎన్నికలు మరింత ఆసక్తికరంగా మారతాయని అనుకున్నారు. ఇక ఇప్పటికే వరుసగా గెలుపొందుతున్న సుభాష్‌చంద్రబోస్ సైతం ఎన్నికల బరిలో నిలిచి తప్పక గెలిచే అవకాశం కనిపించింది. దీన్ని మొత్తం బేరీజు వేసిన అధికార పార్టీ సూపర్ ఎన్నికకు ఫుల్‌స్టాప్ పెట్టి ఈ విధంగా ముందుకెళ్లింది.